క్లుప్తంగా

నిషేధిత పాలిథిన్ సంచులు సీజ్



ఓ చికెన్ షాపులో తనిఖీలు చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం: నిషేధిత పాలిథిన్ సంచులను వ్యాపారుల వద్ద నుంచి సీజ్ చేసినట్లు మున్సిపల్ కార్యాలయ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ తెలిపారు.రాజాం పట్టణంలోని బొబ్బిలి రోడ్డులో పలు దుకాణాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఆరు కిలోల నిషేధిత పాలిథిన్ సంచులను పట్టుకుని, వ్యాపారులకు అపరాధ రుసుం విధించారు. వ్యాపారులు పాలిథిన్ నిషేధానికి సహకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోరారు.

పాఠశాల అభివృద్ధికి సాయం



హెచ్‌ఎంకు నగదు అందజేస్తున్న దాతలు

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి ఆ గ్రామానికి చెందిన దాతలు సాయం అందించారని హెచ్‌ఎం పాలవలస శ్రీనివాస రావు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన చందక రాము రూ.20 వేల నగదు అందించగా, మక్క హరీష్ అనే దాత పాఠశాల నుంచి ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థినులు కొంచాడ చాందిని, డోకి గౌరీలకు పుస్తకాలు అందించారు. పాఠశాలలో చదువుతున్న 88 మంది విద్యార్థులకు పాలవలస తరుణ్ అనే దాత రూ. 6 వేలు విలువ చేసే ఐడీ కార్డులు అందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువత పాల్గొన్నారు.

సత్యసాయి బోధనలు అనుసరణీయం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సత్యసాయి బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక సత్యసాయి సేవా మందిరంలో సత్యసాయి శత జయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో శంబంగి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రేమ తత్వంతో జీవించాలని, సత్యమే ఎల్లప్పుడూ విజయం సాధిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి భమిడిపాటి విశ్వనాథ శర్మ,సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తం



గొల్లాదిలో వేగావతినదిని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్

బాడంగి: మండలంలో వేగావతి నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి,డీడీఓ కిరణ్ కుమార్ సూచించారు. మండలంలోని గొల్లాది వద్ద వేగావతినదిలో వరద ప్రవాహాన్ని మండల అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. నదీతీర ప్రాంత ప్రజలు నదిలో దిగకుండా దండోరా వేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. వర్షాల నేపథ్యంలో ప్రజల కు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, తహసీల్దార్ కె.సుధాకర్, ఏపీఓ సాయిరాం, ఏపీఎం రత్నకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మన్యం జిల్లాలో విలీనం చేయాలి

వంగర: మండలంలోని వి.వి.ఆర్.పేట పంచాయతీని పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం చేయాలని ఆ గ్రామ సర్పంచ్ బత్తిన గురువులు కోరారు. సోమవారం గ్రామంలో గ్రామ సభ నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి తమ గ్రామం 15 కిలోమీటర్ల దూరంలో ఉందని, విజయనగరం జిల్లా కేంద్రానికి వంద కిలోమీటర్లకు పైగా దూరంలో ఉందని సర్పంచ్ అన్నారు. వి.వి.ఆర్.పేటతోపాటు పంచాయతీ పరిధిలోని జె.కె.గుమ్మడ గ్రామస్తులంతా నిత్యం విద్య, ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య,ఇతక అవసరాలకు పార్వతీపురం వెళతారని చెప్పారు. అన్ని విధాలా సౌలభ్యంగా ఉండేందుకు తమ పంచాయతీని పార్వతీపురం మన్యం జిల్లాలో కలపాలని అన్నారు . ఈమేరకు గ్రామసభలో తీర్మానం చేశామని, ఉన్నతాధికారులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు మరిచెర్ల గంగారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

- వరిలో కాలిబాటలతో బహుళ ప్రయోజనాలు
- చీడపీడలు, తెగుళ్ల వ్యాప్తికి చెక్
- ఎరువులు వేసుకునేందుకు అనుకూలం
- ఎక్కువ పిలకలు వచ్చి దిగుబడి పెరిగే అవకాశం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది



బొద్దూరు వద్ద వరిపొలాల్లో రైతులు ఏర్పాటుచేసిన కాలిబాటలు

కాలిబాటలు.. దిగుబడులకు మార్గాలు

రాజాం: ఖరీఫ్ వరి ఊభాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అడపాదడపా కురిసిన వర్షాలతో పాటు సాగునీటి కాలువల ఆధారంగా రైతులు వరినాట్లు పూర్తి చేస్తున్నారు. ఇక్కడి నుంచి పంట చేతికందేవరకు యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. యాజమాన్య పద్ధతుల్లో భాగంగా వరి పంటలో కాలిబాటలు తీయడం చాలా అవసరమని, వీటివల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని రాజాం మండల వ్యవసాయశాఖాధికారి(ఏఓ) సీహెచ్.రఘునాథ్ చెబుతున్నారు.రైతులకు ఖర్చు లేకుండా సాగులో ఎదురయ్యే అనేక సమస్యలకు పరిష్కారం చూపేందుకు కాలిబాటలు దోహదపడతాయని అంటున్నారు. వరి నాట్లు వేసిన తర్వాత కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామాల్లో వీఏఏలు రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాయ అధికారి పేర్కొన్నారు.



పాగిరి పొలాల్లో కాలిబాటలు ద్వారా ఎరువులు వేస్తున్న రైతు

శాస్త్రీయ పద్ధతి



వరి పొలాల్లో కాలిబాటలు ఏర్పాటుచేయడమనేది శాస్త్రీయ పద్ధతి. పూర్వీకులు కూడా ఈ పద్ధతిని అవలంభించి మంచి దిగుబడులు సాధించేవారు. వరి సాగులో యాజ మాన్య పద్ధతులు పాటించేందుకు, సస్యరక్షణ చర్యలకు ఈ కాలిబాటలు ఎంతో ఉపయోగపడతాయి. పంట ఆరోగ్యంగా ఉంటుంది, ఎక్కువ పిలకలు వేసి, దిగుబడి పెరుగుతుంది. ఎరువులు వేసుకునేందుకు, కలుపు నివారణ చర్యలకు సులభంగా ఉంటుంది. ఈ పద్ధతిని కొన్నేళ్లుగా అవలంబిస్తున్నాం.

– కెంబూరి వెంకటేశ్వరరావు, రైతు, లక్ష్మీపురం, రేగిడి మండలం.

కాలిబాటలు వేసే విధానం..

వరి నాట్లు వేసిన తర్వాత పొలంలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పున కాలిబాటలు వేయాలి. నాట్లు వేసిన 12 నుంచి 16 రోజుల్లో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం. ప్లాస్టిక్, కొబ్బరి, పురి తాడు తీసుకుని గట్టుకు ఒక వైపు కర్రను పాతి అవతలి వైపున కూడా కర్ర పాతి దానికి తాడును బాగా సాగదీసి కట్టాలి. ఈ తాడుకు సమాంతరంగా 20 సెంటీమీటర్ల దూరంలో మరో తాడు కట్టాలి. రెండు తాళ్ల మధ్యలో ఉన్న వరి మొక్కలను తొలగించాలి. తొలగించిన మొక్కలను పొలంలో పలుచగా ఉన్న చోట నాటుకోవచ్చు. వెదజల్లే పద్ధతిలో సాగు చేసే వారు విత్తనాలు చల్లిన 15 రోజుల నుంచి 20 రోజుల వ్యవధిలో వరి మొక్కలు తొలగించి కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి.

అవగాహన కల్పిస్తున్నాం..



ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాలు రైతులకు ఇబ్బందులు పెట్టాయి. చాలా చోట్ల వరినాట్లుకు ఇబ్బందులు వచ్చాయి. ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తున్నాయి. రైతులు వరి నాట్లు వేసే పొలాల్లో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి. కాలిబాటలతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతుల్లో కూడా మంచి స్పందన ఉంది.

– కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం

దిగుబడి పెరిగే అవకాశం

కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వరి మొక్క మొదళ్లకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి బాగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యంగా పెరుగుతుంది. వరి పిలకలు దుబ్బులు చేయడంతో పాటు బలాన్ని సంతరించుకుంటాయి. తుఫాన్లు, భారీ వర్షాలు తదితర ప్రకృతి విపత్తుల సమయంలో పైరులో కిరణ జన్య సంయోగక్రియ సమర్థవంతంగా జరిగి, దిగుబడి తగ్గకుండా ఉంటుంది. పైరులో చీడపీడల ఉధృతిని దగ్గరగా గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో నివారణ చర్యలు చేపట్టేవీలుం టుంది. ఒక భాగం నుంచి ఇంకో భాగానికి చీడపీడలు సోకకుండా అడ్డుకోవచ్చు. మొక్కల్లో పత్ర హరితం బాగా పెరుగుతోంది. పూత అధికంగా వచ్చి పెద్ద పరిమాణంలో ధాన్యం హారం కట్టేవీలుంది. కలుపు తొలగించడానికి, అన్ని వైపులా ఎరువులు సమానంగా వేయడంతో పాటు సులభంగా పురుగుమందులు పిచికారీ చేసుకునే అవకాశం కలుగుతోంది. పంట కోత దశలో అపరాల విత్తనాలు జల్లుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయి.

ఓట్ల చోరీతోనే అధికారంలోకి వచ్చారు



మాట్లాడుతున్న మువ్వల శ్రీనివాసరావు

బొబ్బిలి: దేశంలో ఓట్ల దొంగతనం జరిగిందని, దొంగ ఓట్లతో కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముvvల శ్రీనివాసరావు ఆరోపించారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఎన్నికల కమిషన్, ఈవీఎంలపై ఉన్న అనుమానాలను రుజువు చేస్తున్నారన్నారు. దీనిపై ఎంత వరకైనా వెళతామని చెప్పడం యాదృచ్ఛికం కాదని ముvvల తెలిపారు. కర్ణాటకలో బీజేపీ గెలవడానికి నకిలీ ఓట్లే కారణమని తేల్చారు. జీరోఇంటి నెంబర్‌తో బెంగుళూరులోని మహదేవ పురంలో 40వేల ఓట్లు పోలవడంపై ఓటర్లు ప్రశ్నించడంతో ఈసీ వెబ్ సైట్ మూసివేయడం దారుణమన్నారు. పదేళ్ల ఎన్నికల డేటా, వీడియోలు ఇస్తే అన్నింటినీ నిరూపిస్తానని రాహుల్ గాంధీ స్పష్టం చేస్తున్నా ఎవరూ కిమ్మనకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈసీ తన నిజాయితీని నిరూపించుకోవాలనీ, మరో వైపు ప్రజలంతా రాహుల్ పోరాటానికి మద్దతు పలకాలని కోరారు.

కూటమిది నయవంచక పాలన



'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కరపత్రాలను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తెర్లాం: ఎన్నికల హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను వంచిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల నాయ కులు ఆరోపించారు. ఉద్దవోలు గ్రామంలో సోమవారం సాయంత్రం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధులు నర్సుపల్లి బాబ్జీరావు, గర్భాపు రామారావు, వైస్ ఎంపీపీ ప్రతినిధి పెనుమత్స అప్పలరాజు, తెర్లాం మాజీ ఎంపీటీసీ ప్రతినిధి నర్సుపల్లి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన సూపర్‌సిక్స్‌తో పాటు ఇతర వందల హామీలను ప్రజలకు గుర్తు చేశారు. ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే అన్నీ చేసేశామని చంద్రబాబు చెబుతుండడం మోసం కాదా అని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. కూటమి మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

చెరువు గట్టు పటిష్టం



కృష్ణంవలసలోని పాత చెరువు గట్టును పరిశీలిస్తున్న డ్వామా పీడీ శారదాదేవి, అధికారులు

సంతకవిటి: మండలంలోని కృష్ణంవలస గ్రామసమీపంలో పాత చెరువు గట్టు ఆదివారం కుంగిపోవడంతో చెరువుకు గండి పడుతుందేమోనని రైతులు, గ్రామస్తులు భయాందోళన చెందారు. ఆదివారం అర్ధరాత్రి రెవెన్యూ సిబ్బంది, జలవనరుల శాఖ అధికారులు స్పందించి కృష్ణంవలస గ్రామస్తుల సహాయంతో జేసీబీతో చెరువు గట్టును పటిష్టం చేశారు.

పరిశీలన

కృష్ణంవలస గ్రామసమీపంలోన పాత చెరువు గట్టును డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి ఎస్.శారదాదేవి సోమవారం పరిశీలించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నదీ తీర ప్రాంత వాసులను నది వైపు వెళ్ల కుండా గ్రామాల్లో దండోరా వేయించాలని, విద్యుత్, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, అవసరమైతే నదీ తీర ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, తహసీల్దార్ బి.సుదర్శనరావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం, గార్రాజుచీపురుపల్లి, ముద్దాడజోగివలస గ్రామ సచివాలయాల్లో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరుతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని, సర్వేలను సకాలంలో పూర్తిచేయాలని చెప్పారు. వర్షాల కారణంగా గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో పర్యటన

తెర్లాం: మండలంలోని డి.గదబవలస, వెలగవలస, అరసబలగ తదితర గ్రామాల్లో తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, ఆర్‌ఐ కృష్ణమూర్తి సోమవారం పర్యటించారు. వర్షాల నేపథ్యంలో ఆయా గ్రామాల్లోని చెరువులు, సాగునీటి కాలువలను పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి తాగునీరు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ, పంట, ఆస్తి, ప్రాణనష్టం కలిగితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా

బొబ్బిలి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిని గుర్తించి సోమవారం స్థానిక కోర్టుకు తరలించామని సీఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. వీరికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె.హేమ ప్రవంతి ఒక్కొక్క రికీ రూ.10వేలు చొప్పున జరిమానా విధించారని చెప్పారు. అలాగే బహిరంగంగా మద్యం తాగిన ఎనిమిది మందికి రూ.500 చొప్పున జరిమానా విధించినట్టు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని, బహిరంగ మద్యం తాగినా శిక్షార్హులేనని సీఐ అన్నారు.

నేత్ర వైద్యశిబిరం



నేత్రపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాజాం సిటీ: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో, జిల్లా అంధత్వ నివారణాసంస్థ సౌజన్యంతో పట్టణంలోని ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీలో సోమవారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది, రోటరీక్లబ్ కార్యదర్శి, ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు 75 మందికి కంటి పరీక్షలు చేసి, వారిలో 20 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఈ 20 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించామని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్ తెలిపారు. 40 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. అలాగే మరణా నంతరం నేత్రదానానికి ముందుకు రావాలని అన్నారు. రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు బి.వి.అచ్యుతరావు, రొటేరియన్ ఎస్.మోహనరావు, రెడ్‌క్రాస్ రాజాం అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, వైద్యసిబ్బంది కళావతి, సింహాచలం, రాంబాబు, పాల్గొన్నారు.

ఉచిత సైకిళ్ల కోసం దరఖాస్తులాహ్వానం

బాడంగి: ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుకుంటున్న తల్లిదండ్రులు లేని అనాథ బాలికలకు బెంగుళూరుకు చెందిన వసుదైక కుటుంబం ఫౌండేషన్ ఉచితంగా సైకిళ్లు అందిస్తోందని, అర్హులు దరఖా స్తు చేసుకోవాలని స్థానిక హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు సోమవారం తెలిపారు. విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ ఇంటికి, పాఠశా లకు కనీసం 2 కిలోమీటర్ల దూరం ఉన్నవారు, గత విద్యాసంవత్సరంలో 80శాతం మార్కులు సాధించిన వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్‌లో సుమారు 100 సైకిళ్లను పంపిణీ చేయనున్నారని, ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు 94413 06012 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల అధికారులుగా సిట్టింగ్‌జడ్జిలను నియమించాలి



మాట్లాడుతున్న వేమిరెడ్డి లక్ష్మునాయుడు, తదితరులు

బొబ్బిలి: ఓట్ల చోరీ సంఘటనలు సగటు ఓటరును మీమాంసలో పడేసి ఆందోళనలు రేకెత్తిస్తున్నాయని ఉత్తరాంధ్ర సాధన సమితి వ్యవస్థాపక కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. పట్టణంలోని ఉత్తరాంధ్రసాధన సమితి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న పరిచయాల మేరకు ఎన్నికల అధికారులు కొన్ని రాజకీయ పార్టీలకు కొమ్ము కాస్తూ ఎన్నికల్లో ఓట్లను తారుమారు చేసే పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రాంతాన్ని బట్టి ఆయా అధికారులను రాజకీయ పార్టీలు బదిలీలు చేయించుకుంటున్నాయని ఆరోపించారు. కొందరు అధికారులు ఎంత నిజాయితీగా ఉన్నా నిక్కచ్చిగా ఎన్నికలను నిర్వహించలేకపోతున్నారని అభిప్రాయపడ్డారు. ఎన్నికల వ్యవస్థ గతంలోలా సక్రమంగా నడవాలన్నా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగాలన్నా ప్రతీ రాష్ట్రంలో ఎన్నికల అధికారులుగా హైకోర్టు సిట్టింగ్ జడ్జిలనే నియమించాలన్నారు. వారి పర్యవేక్షణలో ఎన్నికలను జరిపిస్తేనే సవ్యమైన,స్వేచ్ఛాయుత ఎన్నికలకు ఆస్కారం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఉత్తరాంధ్రసాధన సమితి సభ్యులు తమ్మిరెడ్డి కృష్ణ, వి.రవికుమార్, జె.శంకరరావు, పి.సూర్యనారాయణ, ఎస్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి ఉత్సవాలు



బొబ్బిలి: శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



రాజాం: పూజలు చేస్తున్న భక్తులు

బొబ్బిలి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని కళింగ వైశ్యభవన్‌లో ఈనెల 16న ప్రారంభమైన కృష్ణాష్టమి ఉత్సవాలు ముగిశాయి. మూడురోజులపాటు నిత్య పూజలందుకున్న శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం సాయంత్రం ఊరేగించారు. పెద బజారు,గొల్లవీధి, పూల్‌బాగ్,ఆంజనేయస్వామి ఆలయం,రైల్వే స్టేషన్ జంక్షన్,ఆస్పత్రి, తాండ్రపాపారాయ విగ్రహం మీదుగా సాగిన ఊరేగింపులో కమిటీ అధ్యక్షుడు సీహెచ్.అప్పలనాయుడు, నాగలక్ష్మి, ఎం.వెంకటరావు, జి.శంకరరావు, గోపాలకృష్ణ, వెంకటనాయుడు, ఆదిలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

తులసీదళాలతో పూజలు

రాజాం:పట్టణంలోని పాలకొండ రోడ్డులో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక బొద్దాం కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.సోమవారం శ్రీకృష్ణునికి భక్తులు తులసీదళాలతో పూజలు నిర్వహించారు.అనంతరం గీతాపారాయణం చేశారు. రాజాం పట్టణంతో పాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

40శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నవారికి పింఛన్ నిలిపివేత



తెర్లాం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రేగి రాంబాబు

తెర్లాం: దివ్యాంగ పింఛన్ అందుకుంటున్న వారిలో 40శాతం కంటే తక్కువఎ వైకల్యం ఉన్న వారికి సెప్టెంబర్ నెల నుంచి పింఛన్ నిలిపివేయనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంపీడీఓ రేగి రాంబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగ పింఛన్ పొందుతున్న వారి సదరం సర్టిఫికెట్లను సంబంధిత విభాగాల వైద్యులు పరిశీలించి, వారికి వైకల్యం ఎంత శాతం ఉందో నిర్ధారించారని చెప్పారు. సచివాలయాల వారీగా మండలంలో ఎంతమందికి పింఛన్ నిలిపివేయనున్న వివరాలను అన్ని గ్రామ సచివాలయాల నోటీసు బోర్డులో ప్రదర్శనకు ఉంచామని, సదరు వ్యక్తులకు సచివాలయ సిబ్బంది నోటీసులు జారీచేస్తారని వివరించారు. పెన్షన్లు నిలిచిపోయిన దివ్యాంగులు మళ్లీ వారి సదరం ధ్రువీకరణ పత్రాలను జీజీహెచ్, ఏరియా ఆస్పత్రుల్లో వైద్యుల వద్దకు తీసుకువెళ్లి పరిశీలించుకోవాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ నీలిమ పాల్గొన్నారు.

186 మందికి కోత..!

బాడంగి: మండలంలో దివ్యాంగ పింఛనుదారుల్లో 186 మందికి సెప్టెంబర్ నుంచి పింఛన్ నిలిచిపోనున్నట్లు సమా చారం. 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారికి పింఛన్‌లు నిలిపివేయాలని ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసిన నేపథ్యంలో వీరంతా పింఛన్‌కు అనర్హులుగా మారనున్నట్లు తెలిసింది. తొలగించిన వారి వివరాలను గ్రామసచివాలయాల్లో అందుబాటులో ఉంచామని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఎవరైనా అప్పీల్ చేసుకోవాలనుకుంటే నెలరోజుల్లోగా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

జర్నలిస్టులకు సత్కారం



జర్నలిస్టులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బేబీ నాయన, రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ సభ్యులు

బొబ్బిలి: నియోజకవర్గంలోని వివిధ దినపత్రికల్లో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టులను జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సన్మానించారు. ఇక్కడ సన్మానం పొందిన జర్నలిస్టులు కందుల శ్రీనివాసరావు, వి.రవిశంకర్, కె.ఆచారి ఆదినారాయణ, జి.కృష్ణమూర్తి, షేక్ రాజా సాహెబ్, ఆకుల వెంకటరావు, మమ్ముల తిరుపతిరావును స్థానిక రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్నారై ఆస్పత్రిలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే బేబీ నాయన, కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జె.సి.రాజు, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, ఎన్నారై ఆస్పత్రి సీఈఓ సింద్రీ శ్రీనివాసన్, రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి, శివకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



రేగిడి: వెంకంపేట వద్ద ఆకులలోవకట్ట గెడ్డను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆశయ్య, అధికారులు

రేగిడి: అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున మండల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకో వాలని చీపురుపల్లి ఆర్డీఓ బి. ఆశయ్య సూచించారు. మండలంలోని రేగిడి సాయన్న ఛానల్, వెంకటపేంట వద్ద ఉన్న ఆకులలోవకట్ట గెడ్డను తహసీల్దార్ కృష్ణలతతో కలిసి సోమవారం పరిశీలించారు. రోడ్లపై నీరు ప్రవ హిస్తే రాకపోకలు నిలిపివేయాలని, నదీ పరివాహక ప్రాంతాల్లో దండోరాలు వేయించాలని సూచించారు. కొమెర, వెంకటాపురం, కందిశ, తునివాడ, బొడ్డవలస, పుర్లి, ఖండ్యాం తదితర గ్రామాల వీఆర్‌ఓలను రాత్రి వేళల్లో ఆయా గ్రామాల్లోనే ఉండాలని ఆదేశించారు. ఆర్డీఓ వెంట ఇన్‌చార్జ్ ఆర్‌ఐ కిరణ్‌కుమార్, తదితరులున్నారు.

అధికారులతో సమీక్ష

వంగర: భారీ వర్షాలు కారణంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని చీపురుపల్లి ఆర్డీఓ బి.ఆశయ్య సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమ వారం సమీక్ష నిర్వహించారు. వర్షాల నేప థ్యంలో మండలంలోని వివిధ గ్రామాల వారి కోసం 14 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నదీతీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు కలెక్టర్ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ రఘునాథా చారి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నష్టం అంచనా వేయాలి

రామభద్రపురం: వర్షాల కారణంగా ప్రజలకు,రైతులకు ఏ విధమైన నష్టం జరగకుండా అప్రమత్తం చేయాలని, ఎక్కడైనా పంట ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేయాలని మండల అధికారులకు మండల ప్రత్యేకాధికారి ప్రశాంతకుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అజా రఫిజాన్‌తో కలిసి మండల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు.అనంతరం రావివలస గిరిజన గ్రామ సచివాయం పరిధిలోని గెడ్డలు,వాగులు,పంట పొలాలను పరిశీలించారు.డీటీ గిరిధర్,డిప్యూటీ ఎంపీడీఓ వెంకటరమణ, హౌసింగ్ ఏఈ వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు

బొబ్బిలిరూరల్: వర్షాల నేపథ్యంలో మండలంలో నదీ పరీవాహక ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులు తలెత్తితే అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించా లని వీఆర్‌ఓలకు ఆదేశాలు జారీచేశామని తహసీల్దార్ ఎం.శ్రీను తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వారిని ఖాళీ చేయించా లని, శిథిల ప్రభుత్వ భవనాల వైపు ఎవరినీ అనుమతించవద్దని వీఆర్‌ఓలకు సూచించామని చెప్పా రు. చెరువులను పర్యవేక్షించి, కట్టలు తెగే పరిస్థితి ఉత్పన్నమైతే, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించామన్నారు. ఆర్‌ఐ రామకుమార్ పాల్గొన్నారు.